సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 18 । జూలై । 2023



చేరువలో ఉన్నత విద్య..!

పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేసేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. IIలో



అర్జీలకు పరిష్కారం

'జగనన్నకు చెబుదాం'లో వచ్చిన అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. IIలో



గెడ్డలపై స్క్రీన్ల ఏర్పాటు

నగరంలో ప్రధాన గెడ్డలపై ఆకర్షణీయమైన స్క్రీన్లు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. IIలో

న్యూస్‌రీల్

స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ రికార్డు ఉత్పత్తి



స్ట్రక్చరల్ మిల్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ **స్ట్రక్చరల్ మిల్ విభాగం** (ఎస్టీఎం) ఈనెల 15న **రికార్డు ఉత్పత్తి** సాధించింది. విభాగంలో తయారయ్యే పలు ఉత్పత్తుల్లో ఒకటైన 50/50/6 ఏంగిల్ ఆ రోజు అత్యధికంగా 2,267 టన్నులు ఉత్పత్తి సాధించారు. ఈ ఏడాది మే 8న అత్యధికంగా 2173 టన్నులు ఉత్పత్తి చేయగా ఇప్పుడు ఆ రికార్డును అధిగమించింది. రికార్డు ఉత్పత్తి సాధించిన ఎస్టీఎం విభాగం ఉద్యోగులను స్టీల్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉప ప్రధాన కార్యదర్శి కోయిలాడ శ్రీనివాసరావు అభినందించారు.

8 స్కూల్ బస్సులపై కేసులు



స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖాధికారులు

గోపాలపట్నం: స్కూల్ బస్సులపై రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన 8 బస్సులపై కేసులు నమోదు చేశారు. నగర పరిధిలో బోయపాలెం, మద్దిలపాలెం, ఎన్ఏడీ జంక్షన్, గాజువాక, తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ఈ తనిఖీల్లో మోటార్ వాహన తనిఖీ అధికారులు గణేష్‌రెడ్డి, ఆర్.సుదీర్, ఒక్కి మున్నీషా, కె.ప్రవీణ్‌కుమార్, చింత మన్మోహన్, పి.శిరీషా, హరిప్రసాద్ శ్రీనివాస్ యాదవ్, సుమన్‌కుమార్, సృజన, మాధవి, వై.లలిత పాల్గొన్నారు.

ఏడుగురు సీఐలకు స్థానచలనం



దొండపర్తి(విశాఖ దక్షిణ): విశాఖ రేంజ్ పరిధిలో ఏడుగురు ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగిస్తూ డీఐజీ హరికృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో వీఆర్‌లో ఉన్న నలుగురికి పోస్టింగ్‌లు ఇవ్వగా.. ఇద్దరిని వీఆర్‌కు పంపించారు. వీఆర్‌లో ఉన్న కె.కె.వి.విజయనాథ్‌ను విజయనగరం డీఎస్‌బీలో పోస్టింగ్ ఇవ్వగా, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న జి.రాంబాబును వీఆర్‌కు పంపించారు. అలాగే వీఆర్‌లో ఉన్న కె.లక్ష్మణమూర్తిని శ్రీకాకుళం డీసీబీకి, డి.నవీన్‌కుమార్‌ను శ్రీకాకుళం డీసీఆర్‌బీలో పోస్టింగ్ కల్పించారు. అలాగే శ్రీకాకుళం డీసీఆర్‌బీలో ఉన్న బి.ప్రసాదరావును నరసన్నపేట సర్కిల్‌కు, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న డి.రామును విశాఖ రేంజ్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న వి.బాబ్జీరావును శ్రీకాకుళం సీసీఎస్‌లో పోస్టింగ్ ఇచ్చారు.

అప్పన్న సన్నిధిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ వేణుగోపాల్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు.

విహారికి రావిశాస్త్రి స్మారక పురస్కారం



సీతంపేట: రావిశాస్త్రి స్మారక పురస్కారం ఈ ఏడాది ప్రసిద్ధ కథా రచయిత, కవి, విమర్శకుడు విహారికి ప్రదానం చేయనున్నట్టు ట్రస్టు వ్యవస్థాపకులు రాచకొండ నరసింహశర్మ, గండికోట రఘురామారావు ప్రకటించారు. రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్, విశాఖ రసజ్ఞ వేదిక సంయుక్తంగా ఏటా ఈ అవార్డు ప్రముఖులకు అందజేస్తున్నాయి. ఈ ఏడాదికి సంబంధించి ఈనెల 30న విశాఖ పౌరగ్రంథాలయంలో పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సెంచరీ దాటినా చలాకీగా..!

- నిత్యం రోజూ 12 కి.మీ. నడక.. వెయిట్ లిఫ్టింగ్
- జీవితంలో ఒక్క రోజూ ఆస్పత్రి మెట్లెక్కని వైనం
- దేశంలో రిటైర్డ్ నేవీ ఉద్యోగుల్లో శతాధిక వృద్ధుడు శ్రీరాములు
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వందల్లో పతకాలు
- నేడు 101వ వసంతంలోకి అడుగుపెట్టనున్న శ్రీరాములు

రోజూ రెండు మూడు గంటల నడక.. ఎనిమిది గంటల నిద్ర.. వ్యాయామం.. ఒంటిపూట భోజనం.. మితాహారం.. ఇదంతా దాదాపు యాభై ఏళ్ల నుంచి అలవాటు చేసుకున్నారాయన! ఇప్పుడాయనకు వందేళ్లు దాటాయి. అయినా.. ఇప్పటికీ నడక మానలేదు. వ్యాయామం ఆపలేదు. సంపూర్ణ ఆరోగ్యంతో రోజుకి 12 కిలోమీటర్లు నడుస్తున్నారు. మంగళవారం 101 ఏట అడుగు పెడుతున్న ఆయన పేరు వి.శ్రీరాములు. ఊరు మచిలీపట్నం. స్థిరపడింది విశాఖపట్నం.

సాక్షి, విశాఖపట్నం: అరవై డబ్బై ఏళ్లకే జీవితం అయిపోయిందనుకుంటూ నిట్టూరుస్తున్న రోజులివి. కానీ.. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన వి.శ్రీరాములు అలా అనుకోవడం లేదు. వయసు నూరేళ్లు దాటినా.. ఇంకా విదేశాల్లో జరిగే అథ్లెటిక్ పోటీలకు సన్నద్ధమవుతున్నారు.

1923 జూలై 18న దిగువ మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన ఆయన తన 21వ ఏట (27 మార్చి 1944లో) అప్పటి రాయల్ ఇండియన్ నేవీలో చీఫ్ పెట్టీ ఆఫీసర్‌గా చేరారు. 1979 డిసెంబర్ 31న కమాండర్ హోదాలో పదవీ విరమణ చేసి విశాఖలో స్థిరపడ్డారు. ఆపై ఆరోగ్యాన్నిచ్చే నడకను అలవాటు చేసుకున్నారు. ఆ తర్వాత రేస్ వాకింగ్‌తో పాటు రన్నింగ్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో వంటి ఆటల్లోనూ సత్తా చాటుతున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో లెక్కకు మిక్కిలి బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. ఏసియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 5, 10, 20 కి.మీ. రేస్ వాకింగ్ పోటీల్లో 9 బంగారు, 5 రజత, 2 కాంస్య పతకాలు, వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో 5 బంగారు, 3 రజత పతకాలను కైవసం చేసుకున్నారు. వెటరన్స్ (మాస్టర్స్) కేటగిరీలో ఇప్పటికీ ప్రపంచస్థాయి పోటీల్లో పాల్గొంటూ బంగారు, రజత, కాంస్య పతకాలను సాధిస్తూనే ఉన్నారు. అంతేనా? పర్వతారోహణంపైనా మక్కువ ఉన్న శ్రీరాములు 79వ ఏట తన కుమారుడు సాగర్‌తో కలిసి 2002లో ఆఫ్రికాలోని కిలీమాంజారో, 81వ ఏట 2004లో ఎవరెస్ట్ బేస్ క్యాంపు, 83వ ఏట హిమాలయాల్లోని పిండారీ గ్లేసియర్‌లను అధిరోహించారు.



తాను సాధించిన పతకాలను చూపిస్తూ...

ఇంకా అంతర్జాతీయ పోటీలకు సై..



శ్రీరాములు 101వ ఏట ఈ ఏడాది నవంబరు 8–12 వరకు ఫిలిప్పీన్స్‌లో జరిగే ఏసియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ కాంపిటిషన్స్‌లో, వచ్చే ఏడాది జూన్‌లో స్వీడన్‌లో నిర్వహించే వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2024 పోటీలకు సిద్ధమవుతున్నారు. శ్రీరాములుది విభిన్న జీవనశైలి. మితంగా తింటారు. ఉదయం మొలకల చట్నీతో ఒక బ్రెడ్ టోస్ట్, కాఫీ లేదా మజ్జిగ తీసుకుంటారు. మధ్యాహ్నం పెరుగన్నమే తింటారు. అందులో కూరలు నంజుకుంటారు. సాయంత్రం కప్పు మజ్జిగ లేదా అరటిపండు తీసుకుంటారు. రాత్రికి ఏమీ తినకుండా 7.30కే నిద్రకు ఉపక్రమిస్తారు. మర్నాడు తెల్లవారుజామున 3.15కి బీచ్‌లో నడకకు బయలుదేరి (12 కి.మీ.) ఉదయం 6 గంటలకు తిరిగి ఇంటికి చేరుకుంటారు. వందేళ్ల ప్రాయంలో ఆయన పుస్తకాలు బాగా చదువుతారు. ఆస్ట్రానమీ, జియో పాలిటిక్స్, నేవీకి సంబంధించిన అంశాలపై ఆసక్తి కనబరుస్తారు. పిల్లలు స్థిరపడటంతో సతీమణితో కలిసి విశాఖలో ఉంటున్నారు.

నేడు శతాధిక సంబరాలు..



శ్రీరాములు 101 ఏటలోకి అడుగిడుతున్న సందర్భంగా విశాఖ బీచ్‌లో సాటి వాకర్ స్నేహితులు మంగళవారం ఉదయం ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించనున్నారు. మరో విశేషం ఏమంటే.. దేశంలో నేవీలో పనిచేసి వందేళ్లకు పైగా జీవించి ఉన్న ఏకైక అథ్లెట్ శ్రీరాములే కావడం విశేషం.



హ్యాపీగా జీవించడమే లక్ష్యం..

నాకేమీ లక్ష్యాలు లేవు. ఉన్నదల్లా ఉన్నన్నాళ్లు హ్యాపీగా జీవించడమే. నేను ఇప్పటివరకు ఆస్పత్రి మెట్లెక్కలేదు. రక్తపోటు, మధుమేహం సహా ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు. ఆఖరి ఘడియల్లోనూ ఆస్పత్రికి వెళ్లకూడదన్నది నా ఆశ. క్రమశిక్షణతో కూడిన జీవితం ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. తక్కువ తిని, ఎక్కువ వ్యాయామం చేయాలని ఈ తరం వారికి నేనిచ్చే సలహా. నా ఆరోగ్య రహస్యం కూడా అదే. త్వరలో అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని మెడల్స్ సాధిస్తానన్న నమ్మకం ఉంది.

– వి.శ్రీరాములు, శతాధిక అథ్లెట్

స్టీల్‌ప్లాంట్ సీఎండీతో ఎంపీ, ఎమ్మెల్యేల భేటీ



స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ ఎంవీవీ, ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఉక్కునగరం: ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిలు సోమవారం స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌ను కలిశారు. ఉక్కు పరిపాలన భవనంలో వారు కలిసి వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కొత్త గాజువాక నుంచి స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వరకు లైటింగ్‌తో కూడిన రోడ్డు నిర్మాణం, అగనంపూడిలో కల్యాణ మండపం ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్ కార్డు కలిగిన నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, కాంట్రాక్టర్లు మారినప్పుడు ఔట్‌సోర్సింగ్ పనుల్లో ఉన్న కార్మికులకు ఎటువంటి ఉపాధి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి అవసరమైన క్యాప్టివ్ మైన్స్ కేటాయింపులు జరిగేలా కేంద్ర ప్రభుత్వంతో తగిన చర్యలు తీసుకోవాలని, కంపెనీ అభివృద్ధి పథంలో నడిపించడానికి కంపెనీ అప్పులు, బకాయిలు ఈక్విటీలుగా మార్చడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి.పాండే తదితరులు పాల్గొన్నారు.

21న ఎంప్లాయీస్ గ్రీవెన్స్ డే

మహారాణిపేట: ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న ఎంప్లాయీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమ సమయం మార్పు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున తెలిపారు. ఈ కార్యక్రమం కలెక్టరేట్‌లో ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యోగులు వ్యక్తిగత ఫిర్యాదులతో సహా ఏ రకమైన ఫిర్యాదులనైనా జిల్లా కలెక్టర్లు/హెచ్‌వోడీలకు సమర్పించవచ్చునని తెలిపారు. అన్ని ఫిర్యాదులను జేకేసీ (జగనన్నకు చెబుదాం) పోర్టల్లో ప్రత్యేక ఐడీలతో నమోదు చేస్తామన్నారు.

కేజీహెచ్‌కు 'ఆరోగ్య' సిరి

- ఆరోగ్యశ్రీలో వేల చికిత్సలు
- జూన్‌లో రూ.4 కోట్ల ఆదాయం



డా॥ వైయస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్



మహారాణిపేట: కేజీహెచ్ ఆర్థికంగా మెరుగుపడుతోంది. ఆరోగ్యశ్రీలో క్యాన్సర్, గుండె జబ్బులకు మెరుగైన వైద్యం అందిస్తుండడం వరంగా మారింది. క్యాన్సర్, గుండె జబ్బులు, డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యాతోపాటు సుమారు 2వేలకు పైగా జబ్బులను ఆరోగ్యశ్రీలో ప్రభుత్వం చేర్చింది. ఈ అవకాశాన్ని కేజీహెచ్ అందిపుచ్చుకుంది. ఇంతవరకు ప్రైవేటు ఆస్పత్రుల్లోనే ఆరోగ్యశ్రీకి మెరుగైన వైద్యం అందేది. ఇప్పుడు కేజీహెచ్ కూడా ఆ జాబితాలో చేరింది. అధునాతన వైద్య పరికరాలను ప్రభుత్వం అందించడంతో కీలకమైన ఆపరేషన్లు ఇక్కడే నిర్వహిస్తున్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలో జూన్ నెలలో వివిధ వైద్య సేవలు అందించినందుకు గానూ రూ.4 కోట్ల ఆదాయం లభించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక నెలలో ఇంత ఆదాయం సమకూరడం ఓ రికార్డు.

కేసులు వివరాలు

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా జూన్‌లో 2,460 మందికి చికిత్సలు అందించారు. దీని ద్వారా రూ.4 కోట్ల ఆదాయం లభించింది. మేలో 2,300 కేసులకు రూ.40 లక్షలు, ఏప్రిల్‌లో 2,200 కేసుల ద్వారా రూ.38 లక్షలు, మార్చిలో 2,300 కేసుల ద్వారా రూ.45 లక్షల ఆదాయం సమకూరింది.

ఆరోగ్యశ్రీలో చికిత్సలు.. సమకూరిన ఆదాయం

నెల	కేసులు	ఆదాయం
మార్చి	2,300	రూ.45 లక్షలు
ఏప్రిల్	2,200	రూ.38 లక్షలు
మే	2,300	రూ.40 లక్షలు
జూన్	2,460	రూ. 4 కోట్లు

ఆరోగ్యశ్రీలో పేదలకు వైద్యం



పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వ ఆశయాన్ని ముందుకు నడిపించేందుకు కృషిచేస్తున్నాం. ఇటీవల కాలంలో ఆరోగ్యశ్రీ పరిధిలో శస్త్ర చికిత్సలు ఎక్కువ చేశాం. దీని ద్వారా అధిక ఆదాయం సమకూరింది. పేదలకు మెరుగైన వైద్యం అందుతోంది. మంగళవారం ఆస్పత్రిలో అన్ని వైద్య విభాగాధిపతులతో సమావేశం ఏర్పాటు చేశారు.

– డాక్టర్ పి.శివానంద్, సూపరింటెండెంట్, కేజీహెచ్

ప్రాణం తీసిన ఫోన్ వివాదం

- ఫోన్‌లో గట్టిగా మాట్లాడుతావా అంటూ వ్యక్తిపై దాడి
- అడ్డుకున్న మామపైన పిడిగుద్దులు
- దెబ్బలకు తట్టుకోలేక అతడు మృతి
- గండిగుండంలో దారుణం



దేముడు మృతదేహం (ఇన్‌సెట్) భీమవరపు దేముడు (ఫైల్)



నిందితుడు బంక అజయ్

ఆనందపురం : స్వల్ప వివాదం కారణంగా క్షణికావేశంలో ఓ వ్యక్తి మరో వ్యక్తిపై విచక్షణా రహితంగా దాడి చేయగా కుప్పకూలిపోయి ప్రాణాలను కోల్పోయాడు. ఈ సంఘటన ఆనందపురం మండలంలోని గండిగుండంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గండిగుండం గ్రామానికి చెందిన భీమవరపు దేముడు(49), లక్ష్మి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. దేముడు నేవల్ డాక్‌యార్డులో కూలిగా పనిచేస్తున్నాడు. కాగా కుమార్తె జగదీశ్వరిని అదే గ్రామానికి చెందిన అక్కిరెడ్డి బంగారాజుకు ఇచ్చి వివాహం జరిపించాడు. రాజేశ్వరి, బంగారాజు దంపతులు గండిగుండం నుంచి రామవరం వెళ్లే రూట్‌లో కొండపై ఉన్న జగనన్న కాలనీలో ఇద్దరు పిల్లలతో నివసిస్తూ అక్కడే కిరాణా వ్యాపారం చేసుకుంటున్నారు. బంగారాజు గండిగుండం వైన్ షాపులో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఇదిలా ఉండగా బంగారాజు నైట్ డ్యూటీకి వెళ్లే సమయంలో అతని మామ దేముడు కుమార్తె, పిల్లలకు తోడుగా వారి ఇంటి వద్దే రాత్రి పడుకుంటూ ఉన్నాడు.

ఇంటి ముందు బైక్ ఆపి...

ఆదివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఇద్దరు యువకులు బుల్లెట్‌పై వచ్చి బంగారాజు ఇంటి ముందు ఆపారు. అందులో ఒక వ్యక్తి ఫోన్‌లో లౌడ్ స్పీకర్ పెట్టి మాట్లాడుతున్నాడు. అదే సమయంలో బంగారాజు ఫోన్‌లో మాట్లాడుకుంటూ ఇంటి బయటకు వచ్చాడు. బుల్లెట్‌పై వచ్చి ఫోన్‌లో మాట్లాడుతున్న వ్యక్తి నేను ఇక్కడ మాట్లాడుతుండగా నువ్వెందుకురా ఫోన్‌లో అంత గట్టిగా మాట్లాడుతున్నావని గద్దించాడు. దీంతో నా ఇంటి వద్దకు వచ్చి నన్నే గద్దిస్తావా అంటూ బంగారాజు సమాధానమిస్తూ అక్కడ నుంచి వెళ్లిపోవాలని కోరాడు. వెంటనే అవతల వ్యక్తి బంగారాజుపై పిడిగుద్దులు కురిపించడంతో కింద పడిపోయాడు. ఇది గమనించిన బంగారాజు భార్య జగదీశ్వరి, మామ దేముడు, గండ్రెడ్డి రమణ అనే మరో వ్యక్తి అవతల వ్యక్తిని నిలువరించడానికి ప్రయత్నించారు.

మద్యం మత్తులో పిడిగుద్దులు

మద్యం మత్తులో ఉన్న ఆ వ్యక్తి అందరిపైన పిడిగుద్దులు కురిపించడంతో అందరూ చెల్లా చెదురైపోయారు. అతని దెబ్బలకు దేముడు కుప్పకూలిపోయి స్పృహ కోల్పోయాడు. స్థానికులు వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా ఒక వ్యక్తి పరారయ్యాడు. కొట్లాటకు దిగిన వ్యక్తి బుల్లెట్‌తో సహా చిక్కాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించి ఆ వ్యక్తిని అప్పగించారు. అప్పటికే దేముడు పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ రామచంద్రరావు, ఎస్ఐ నరసింహమూర్తి విచారణ జరిపి పట్టుబడిన నిందితుడు యారాడ గ్రామానికి చెందిన బాక్సర్ బంక అజయ్‌గా గుర్తించారు. అతను మారిటోరియం బోర్డులో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. అజయ్‌తో వచ్చిన మరో వ్యక్తి సింహాచలానికి చెందిన కోన శ్రీనుగా గుర్తించారు. ఈ సంఘటనలో గాయపడిన మిగతా వారిని చికిత్స కోసం తరలించారు. మృతదేహానికి భీమిలి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ నరసింహమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఎకో వైజాగ్' విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేసిన మేయర్, జీవీఎంసీ కమిషనర్ తదితరులు

డాబాగార్డెన్స్: విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించేందుకు చిత్రలేఖన పోటీలు అవసరమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఎకో–వైజాగ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు ఈ నెల 7న పర్యావరణంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఉత్తమ చిత్రాలు గీసిన విద్యార్థులకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 592 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని సుమారు 30 వేల మంది విద్యార్థులు చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్నారని, వీరిని సీనియర్, జూనియర్ విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహించామన్నారు. ఉత్తమ చిత్రాలు గీసిన సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతిగా రూ.25వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15వేలు, తృతీయ బహుమతిగా రూ.10వేలు, అలాగే జూనియర్ విభాగానికి ప్రథమ బహుమతిగా రూ.15వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు, తృతీయ బహుమతిగా ఇద్దర్ని ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.3,500 చొప్పున బహుమతులతో పాటు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశామన్నారు. అంతేకాకుండా మరో 20 మందికి ప్రత్యేక బహుమతులు అందజేశామని చెప్పారు. కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, నగర పరిశుభ్రతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయుల కృషి అవసరమన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో విశాఖను ప్రథమ స్థానంలో నిలిపేందుకు పలు సంఘాల సహకారంతో జీవీఎంసీ ఎంతో కృషి చేస్తుందని, ఎకో–వైజాగ్‌లో ఎకో క్లీన్, ఎకో గ్రీన్, ఎకో బ్లూ, ఎకో జీరో ప్లాస్టిక్, ఎకో జీరో పొల్యూషన్ అనే అంశాల్లో ఏదైనా ఒక కాన్సెప్ట్‌ను థీమ్‌గా ఎంచుకొని విద్యార్థులు చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావుతో పాటు పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పొడిగింపు

ఎంవీపీకాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2023 ప్రవేశాల దరఖాస్తుల గడువు పొడిగించినట్టు ఇగ్నో విశాఖ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు సోమవారం తెలిపారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తునున్నారు. https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. జులై 31 వరకు గడువు పొడిగించారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలని ధర్మారావు తెలిపారు.

నేడు మినీ జాబ్‌మేళా

మురళీనగర్: ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో చినగంట్యాడలోని ఎంవీఆర్ డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో మంగళవారం మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి సాయి కృష్ణచైతన్య చెప్పారు. హెటిరో, వరుణ్ మోటార్స్, బీమా జ్యూయలర్స్, అపోలో ఫార్మసీ, ఈఎస్‌ఈఎం ఎకో ఎఫ్ఆర్ఐ కంపెనీల్లో మొత్తం 260 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, బీటెక్, డిప్లమా మెకానికల్, ఐటీఐ ఫిట్టర్, బీ/డీ/ఎం.ఫార్మసీ విత్ పీసీఐ, డిగ్రీ, ఇంటర్, పది పాసైన 18–35 ఏళ్ల వయసు గలవారు హాజరు కావచ్చన్నారు. వివరాలకు 9292553352 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మిస్సోరీ స్టేట్ యూనివర్సిటీతో నిర్వహిస్తున్న ఎం.ఎస్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం, స్కాంటన్ యూనివర్సిటీతో నిర్వహిస్తున్న ఎం.ఎస్ బిజినెస్ అనలిటిక్స్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తెలిపారు. ఇతర వివరాలు ఏయూ వెబ్‌సైట్ నుంచి, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ కార్యాలయం నుంచి పొందవచ్చన్నారు. ఏయూ సైన్స్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ కార్యాలయం మొదటి అంతస్తులోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బోటు షికారు పునఃప్రారంభం

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో సోమవారం సాయంత్రం నుంచి బోటు షికారు పునఃప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతికూల వాతావరణం వల్ల బోటు షికారు కొన్ని రోజులుగా నిలిపివేశారు. ప్రస్తుతం సముద్రంలో అనుకూల వాతావరణం ఉండటంతో పునఃప్రారంభించారు.

వచ్చే నెల 12 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: ఫ్రీడమ్ కప్ పేరిట బ్యాడ్మింటన్ పోటీలు ఆగస్టు 12 నుంచి 3 రోజుల పాటు జరగనున్నాయి. 3కేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీలు విశాఖ రైల్వే ఇండోర్ ఇన్‌క్లేవ్‌లో నిర్వహించనున్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సినీ దర్శకుడు రాజమౌళి పోటీల పోస్టర్‌ను విడుదల చేశారు. వీరు ఈవెంట్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు మురళి,రమారాజమౌళి, కీర్తన, వల్లి,రాజు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాల పరిశీలన

విశాఖ స్పోర్ట్స్ : విశాఖ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కోచ్‌లతో శాప్ బోర్డు డైరెక్టర్ డానియల్ ప్రదీప్ సోమవారం సమావేశమయ్యారు. క్రీడాభివృద్ధికి తీసుకోవలసిని చర్యలపై చర్చించారు. బాక్సింగ్, జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాప్రాంగణాలను పర్యవేక్షించారు.

చేరువలో ఉన్నత విద్య..!

- ప్రతీ మండలంలో రెండు జూనియర్ కాలేజీలు
- ఇందులో ఒకటి బాలికలకు ప్రత్యేకం
- ఆ దిశగానే గత ఏడాది ఉమ్మడి విశాఖలో 10 ప్లస్ టూ స్కూల్స్ ఏర్పాటు
- తాజాగా కో - ఎడ్యుకేషన్ కాలేజీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- విశాఖకు 1, అనకాపల్లికి 3, అల్లూరి జిల్లాకు 2 మంజూరు


ప్లస్-2 స్కూల్లో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం విద్యార్థినులు


నెహ్రూనగర్ ఉన్నత పాఠశాల

విశాఖ విద్య: పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేసేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతీ మండలంలో రెండు జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేస్తోంది. ఇందులో ఒకటి బాలికల కోసం కేటాయించనున్నారు. బాలికా విద్యను ప్రోత్సహించాలనే తలంపుతో గతేడాది ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఇంటర్మీడియట్ కోర్సుల నిర్వహణకు 10 ప్లస్ టూ స్కూల్స్ (విశాఖపట్నంలో 6, అనకాపల్లి జిల్లాలో 4)ను ప్రారంభించారు. తాజాగా అవసరమైన మండలాల్లో కో - ఎడ్యుకేషన్ కాలేజీల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఉమ్మడి విశాఖలో ఇదీ పరిస్థితి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఏటా 50 వేల మందికి పైగా విద్యార్థులు ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరుతారు. విశాఖపట్నం జిల్లాలో 185 జూనియర్ కాలేజీలు ఉండగా, ఇందులో ప్రభుత్వ యాజమన్యాల పరిధిలో 25 అందుబాటులో ఉన్నాయి. అనకాపల్లిలో 136 కాలేజీల్లో 60, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 39లో 27 ప్రభుత్వ యాజమన్యాల పరిధిలో నిర్వహిస్తున్నారు.

పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం

కొత్తగా జూనియర్ కాలేజీ మంజూరు కోసం గతంలో ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. అందుబాటులో కాలేజీలు లేక, గ్రామీణ ప్రాంతాల్లోని అనేక మంది విద్యార్థినులు ఉన్నత చదువులకు దూరమయ్యే పరిస్థితులు ఉండేవి. దీన్ని గుర్తించిన దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఒకేసారి ఏకంగా 34 కస్తూర్బా గాంధీ విద్యాలయాలను మంజూరు చేశారు. ఆ తర్వాత వచ్చిన పాలకులెవ్వరూ కొత్త కాలేజీల మంజూరుకు శ్రద్ధ తీసుకోలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కొత్త కాలేజీల ఊసే లేకపోగా, ఉత్తరాంధ్ర జిల్లాకు కూడలిగా ఉన్న విశాఖపట్నం కేంద్రంగా కొంతమంది కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేలా ప్రభుత్వ ఆధ్వర్యంలోని జూనియర్ కాలేజీలను నిర్వీర్యం చేశారు.

ప్రతీ మండలంలో రెండు కాలేజీలు

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ముందుకెళ్తోంది. ప్రతీ మండలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు జూనియర్ కాలేజీలు అందుబాటులోకి తీసుకొస్తాంది. ఒకటి బాలికల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తూనే, మరొకటి కో - ఎడ్యుకేషన్ కాలేజీగా ఉండేలా ప్రాధాన్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అవసరమైన మండలాల్లో అదనపు కాలేజీల ఏర్పాటుకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కొత్తగా 6 కో ఎడ్యుకేషన్ కాలేజీలు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో కొత్తగా ఆరు కో - ఎడ్యుకేషన్ జూనియర్ కాలేజీలు మంజూరయ్యాయి. విశాఖపట్నం జిల్లా పద్మనాభం, అనకాపల్లి జిల్లాలో అచ్యుతాపురం, నాతవరం, ఎస్.రాయవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొయ్యూరు, పెదబయలు మండలాల్లో కో - ఎడ్యుకేషన్ జూనియర్ కాలేజీలు మంజూరు చేశారు. ప్లస్ - 2 స్కూల్స్‌గా గుర్తించే వీటిని పాఠశాలల్లోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆయా మండలాల్లో పదో తరగతి అనంతరం ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు సౌలభ్యంగా ఉండే పాఠశాలలను గుర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు



ప్రతీ మండలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు జూనియర్ కాలేజీలు ఉండాలనేది ప్రస్తుత ప్రభుత్వం ఉద్దేశం. ఇది చాలా మంచి నిర్ణయం. డ్రాపవుట్ల నివారణకు దోహదపడుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువుల వైపు వస్తారు.

– ఎల్.చంద్రకళ, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

అర్జీలకు సంతృప్తికర పరిష్కారం చూపాలి

మహారాణిపేట : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. అర్జీదారులతో మాట్లాడి వారి స్పందన తెలుసుకుని ఈకేవైసీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జిల్లా అధికారులు అర్జీలను స్వీకరించారు. మండల స్థాయిలో అధికారులు పది శాతం అర్జీలను వ్యక్తిగతంగా పరిశీలించి ఈకేవైసీ చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 544 ఈకేవైసీలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి, సమీక్ష సమావేశాలకు జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, అనుమతి లేకుండా గైర్హాజరైనా, దిగువ స్థాయి సిబ్బందిని పంపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొత్తం 314 వినతులు రాగా, వీటిలో రెవెన్యూ విభాగానికి 104, జీవీఎంసీకి 53, పోలీసు- 25, ఇతర శాఖలకు-132 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాస మూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తక్షణమే ఫిర్యాదుల పరిష్కారం

సీపీ త్రివిక్రమ్‌వర్మ ఆదేశం


ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి : స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 50 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు, లీగల్ అడ్వైజర్ పి.వి.రామకృష్ణతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

డయల్ యువర్ మేయర్‌కు 11 'జగనన్నకు చెబుదాం'కు 116



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, మేయర్ హరివెంకట కుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ మేయర్‌కు 11 వినతులు.. ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 116 ఫిర్యాదులు వచ్చాయి. తన చాంబర్లో నిర్వహించిన డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో హరివెంక కుమారి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి మేయర్ వెంకట కుమారి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, సీఎంఒహెచ్ డాక్టర్ నరేష్ కుమార్, డీడీహెచ్ దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇలా.. : డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో 11 వినతుల్లో ఇంజినీరింగ్ విభాగానికి 5, టౌన్‌ప్లానింగ్‌కు రెండు, పబ్లిక్ హెల్త్‌కు రెండు, యూడీసీకి 2 వచ్చాయి. జగనన్నకు చెబు దాం కార్యక్రమంలో 116 వినతుల్లో జోన్-1 నుంచి మూడు, రెండో జోన్‌కు 17, మూడో జోన్‌కు 21, నాల్గవ జోన్‌కి 16, ఐదో జోన్‌కి 12, ఆరో జోన్‌కి 24, ఏడో జోన్‌కి ఒకటి, ఎనిమిదో జోన్‌కి 12, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి 10 ఫిర్యాదులు అందాయి.

ఖైదీల మానసిక పరివర్తనకు క్రీడలు దోహదం

బీచ్‌రోడ్డు: ఖైదీలకు, బాల బాలబాలికలకు క్రీడల ద్వారా మానసిక పరివర్తన సాధించాలని ఇండియన్ ఆయిల్ చైర్మన్ శ్రీకాంత్ మాధవ్ వైద్య తెలిపారు. పరివర్తన-ప్రిజన్ ప్రైడ్ ఐదో ఎడిషన్, స్మైల్ ఫర్ జువైనల్ రెండో ఎడిషన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు ఆయన చెప్పారు. ఖైదీలలో సానుకూల పరివర్తనకు క్రీడలు, క్రమశిక్షణ, పట్టుదలను పెంపొందించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఈ పోటీల్లో 17 రాష్ట్రాలకు చెందిన వెయ్యి మంది ఖైదీలు పాల్గొంటున్నారన్నారు. అలాగే 18 బాలల గృహాల్లో కూడా పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

స్టీల్‌క్లబ్ కాంట్రాక్ట్ కార్మికుడి ఆత్మహత్య


ఈశ్వరరావు మృతదేహం

ఉక్కునగరం: సెక్టార్-1 స్టీల్ క్లబ్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు తన క్వార్టర్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. క్లబ్ అన్ స్కిల్డ్ కార్మికుడిగా పని చేస్తున్న కణితి ఈశ్వరరావు (46) సెక్టార్-1లోని 64బి క్వార్టర్‌లో తన కుటుంబంతో నివశిస్తున్నారు. మద్యం సేవించి విధులు నిర్వహించిన ఈశ్వరరావును 15 రోజుల క్రితం క్లబ్ కమిటీ సస్పెండ్ చేసింది. ఆ తర్వాత అతను ఇంటి వద్ద ఉంటూ మద్యం సేవించడం కొనసాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం బయట నుంచి వచ్చి బెడ్‌రూమ్‌లో పడుకున్నాడు. రాత్రి అయినా అతను లేవకపోవడంతో బలవంతంగా తలుపులు తెరిచి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే దించి ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు తెలిపారు.

ఉత్సాహంగా ట్రెక్కింగ్


ట్రెక్కింగ్‌లో పాల్గొన్న సభ్యులు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం ఎర్రమట్టి దిబ్బల్లో యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రెక్కింగ్ ఉత్సాహంగా సాగింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలకు చారిత్రాత్మక ఎర్రమట్టి దిబ్బలు ప్రాముఖ్యతను తెలిపేందుకు ఈ సాహస కార్యక్రమం నిర్వహించినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. వీరిలో 9 మంది మహిళలు, ఐదుగురు యువకులు, 64 ఏళ్ల వయస్సు వృద్ధులు పాల్గొన్నారు. పర్యాటక అధికారి దాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ట్రెక్కింగ్‌ను ప్రారంభించారు. సభ్యులంతా ఉదయం 7 గంటలకు ట్రెక్కింగ్ ప్రారంభించి 8.30 గంటలకు ఎర్రమట్టి దిబ్బలు వ్యూ పాయింట్‌కు చేరుకున్నారు. అసోసియేషన్ జిల్లా శాఖ చైర్మెన్ కేవీ రాజు, ఉపాధ్యక్షుడు పి.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం : పలు రైళ్లను రీషెడ్యూల్ చేసినట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. షాలిమార్‌లో సోమవారం మధ్యాహ్నం 3.20గంటలకు బయల్దేరాల్సిన షాలిమార్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12841) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 14 గంటలు ఆలస్యంగా మంగళవారం తెల్లవారు 2గంటలకు బయల్దేరింది. విశాఖలో సోమవారం రాత్రి 7.10 గంటలకు బయల్దేరాల్సిన విశాఖ - తిరుపతి(08583) స్పెషల్ సుమారు 4గంటలు ఆలస్యంగా రాత్రి 11.30గంటలకు బయల్దేరింది. ఈ రైళ్లు అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్‌లకు చేరుకోనున్నాయి.

స్థాయీ సంఘ ఎన్నికల్లో సీపీఐ పాల్గొనదు

అల్లిపురం: ఈ నెల 19న జరగనున్న జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికల్లో సీపీఐ పార్టీకి చెందిన 72వ వార్డు కార్పొరేటర్ ఏజే స్టాలిన్ ఓటింగ్‌లో పాల్గొనరని సీపీఐ జిలా కార్యదర్శి ఎం.పైడిరాజు తెలిపారు. ఈ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున సీపీఐ కార్పొరేటర్ ఓటింగ్‌లో పాల్గొనరని పేర్కొన్నారు.

గెడ్డలపై ఆకర్షణీయమైన స్క్రీన్ల ఏర్పాటు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



సాగర్‌నగర్ వద్ద 50 వేల కప్పులతో రూపొందించిన స్క్రీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్/కొమ్మాది: నగరంలో ప్రధాన గెడ్డలపై ఆకర్షణీయమైన స్క్రీన్ల ఏర్పాటు చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమ వారం రుషికొండ, సాగర్‌నగర్, ఎంవీపీ తదితర ప్రాంతాల్లోని గెడ్డలపై ఏర్పాటు చేసిన ఆకర్షణీయమైన స్క్రీన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా నగరంలోని ప్రధాన గెడ్డలపై రోడ్డు కిరువైపులా ఉన్న కల్వర్టులకు ఆకర్షణీయంగా ఆ ప్రాంత నామాన్ని తెలుపుతూ వ్యర్థాలతో తయారు చేసిన నమూనాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రుషికొండ బీచ్‌లో గెడ్డ కనిపించకుండా ఏర్పాటు చేసిన ఆకర్షణీయమైన ఆకృతి, సాగర్ నగర్‌లో 50 వేల ప్లాస్టిక్ మూతలతో ఏర్పాటు చేసిన 'క్లీన్ అవర్ సి' ప్లాస్టిక్ ఫ్రీ నినాదంతో తీర్చిదిద్దామన్నారు. అలాగే ఎంవీపీలో గెడ్డపై మొక్కల కుండీలు వినూత్నంగా తీర్చిదిద్దామని చెప్పారు.

నగరంలో 44 ప్రధాన గెడ్డలను గుర్తించి వాటిని ఆయా ప్రాంతాలు తెలిపే ఆకృతులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నా రు. పర్యటనలో డీటీహెచ్ దామోదర రావు, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో హెచ్‌పీసీఎల్ ఉద్యోగులు


మొక్క నాటుతున్న ఈడీ రతన్‌రాజ్

మల్కాపురం : హెచ్‌పీసీఎల్ 49వ వ్యవస్థాపక దినోత్సవంగా ఘనంగా నిర్వహించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.రతన్‌రాజ్, సిబ్బంది సుమారు 2,500 మొక్కలు నాటారు. రోటరీ బ్లడ్ బ్యాంకు సహకారంతో సుమారు 120 మంది ఉద్యోగులు, అధికారులు రక్తదానం చేశారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న ఉద్యోగులకు ఈడీ రతన్‌రాజు అభినందనలు తెలిపారు.

ఎకో - వైజాగ్‌ను విజయవంతం చేయండి


కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: ఎకో - వైజాగ్‌ను విజయవంతం చేయాలని, అందుకు ప్రతి ఒక్కరూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటాలని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ముస్తీ అల్తాఫ్ నగర ప్రజలకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా పువ్వులు, పండ్లు ఇచ్చే మొక్కలతోపాటు ఔషధ మొక్కల పెంపకానికి ప్రాధాన్యమివ్వాలని కోరారు. విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం మొక్కలు నాటిన అనంతరం ఆమె మాట్లాడారు. విశాఖలో ఈ ఏడాది అత్యధికంగా మొక్కలు నాటుతామని తెలిపారు. రోటరీ క్లబ్ కార్యదర్శి ఎస్.లావణ్య మాట్లాడుతూ పక్షులు, ఇతర జీవులకు ఆహారాన్ని ఇచ్చే చెట్లను, పక్షులు గూళ్లు పెట్టుకునే చెట్లకు, ఔషధ మొక్కలు నాటేందుకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పుష్పలత, ఏయూ సోషల్ వర్క్ విద్యార్థులు రమణి, ధర్మారావు, గోపీచంద్, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, హైమావతి, అనురాధ, రాధ, శ్రీనివాస్, రాకేష్, అల్తాఫ్ బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.